క్లుప్తంగా

రాజారెడ్డితో మర్యాద పూర్వక కలయిక



రాజగోపాల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించిన సుధీర్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని బ్రాహ్మణపల్లిలో నివాసంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించాలని సుధీర్‌రెడ్డి ఆకాంక్షించారు.

వేప, రాగి మొక్కల ప్రతిష్ట



రాగి, వేప మొక్కల ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లపరెడ్డిపల్లిలో నిర్మాణంలో ఉన్న కృష్ణ మందిరం పక్కన బుధవారం వేప, రాగి మొక్కల ప్రతిష్టా కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణ మందిరానికి నైరుతి దశలో పాడుబడిన బావి ఉండగా, వాస్తు పండితుల సూచనల మేరకు బావిని పూడ్చి ఆ ప్రదేశంలో రాగి, వేప మొక్కలను నాటామని నిర్వాహకులు తెలిపారు. ప్రజల నమ్మకాలకు అనుగుణంగా జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొడ్ల వెంకురెడ్డి, స్థానిక నాయకులు పీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హజరత్‌రెడ్డి, ఏడెం ప్రభాకర్‌రెడ్డి, కోనేపల్లి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం ముస్తాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎంఎస్‌హెచ్ ఫౌండేషన్ తరఫున విద్యా సామగ్రి పంపిణీ చేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల కవసరమైన పలకలు, పెన్నులు, పుస్తకాలు, జామెంటరీ బాక్స్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్‌కే మౌలాలి, ఉపాధ్యక్షుడు ఎస్‌కే నూర్‌బాషా, ఎస్‌కే మహబూబ్ బాషా, ఎస్‌కే షాహిదుల్లా, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంగా అనంతలక్ష్మి



ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా అనంత లక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ హెచ్ఎంగా పని చేస్తున్న శేషాద్రివాసు ఎంఈఓగా పదోన్నతిపై బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ముత్తుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనంతలక్ష్మి పదోన్నతిపై ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, చైర్మన్ తదితరులు శాలువా కప్పి పూలమాలవేసి అభినందించారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ, సీఐలను కలిసిన ఆత్మకూరు నూతన ఎస్సై కె.ముత్యాలరావు

ఆత్మకూరు: ఆత్మకూరు నూతన ఎస్సైగా కె.ముత్యాలరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా పనిచేసిన ఎం.శివ శంకర్‌రావు నెల్లూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. మనుబోలులో ఎస్సైగా పని చేస్తున్న ముత్యాలరావు ఆత్మకూరుకు బదిలీపై వచ్చారు. డీఎస్పీ ఎస్.కోటారెడ్డి, ఇన్‌చార్జి సీఐ రవినాయక్‌లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

దారులన్నీ ఉదయగిరి వైపు

వైఎస్సార్‌సీపీ ప్రజల పార్టీ మరోసారి నిరూపితమైంది. ఉదయగిరిని అభిమాన తరగం ముంచెత్తింది. పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉందని దుష్ప్రచారం చేసే ప్రతిపక్షాలకు ఉదయగిరి నియోజకవర్గ నూతన సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిచయ వేదికకు తరలివచ్చిన అభిమాన జనాన్ని చూసి ముచ్చెమటలు పట్టాయి. టికెటిచ్చి ఎమ్మెల్యేగా గెలిపించిన పార్టీకి వెన్నుపోటు పొడిచి వైఎస్సార్‌సీపీని ఓడిస్తానంటూ బీరాలు పలుకుతున్న ఆ ఎమ్మెల్యేకు గుండెలు జారాయి. నియోజకవర్గంలో మండలాల నాయకులతో నిమిత్తం లేకుండా అభిమానులు, ముఖ్యంగా మహిళలు స్వచ్ఛందంగా తరలిరావడంతో ఉదయగిరి కిటకిటలాడింది.

- మేకపాటి రాజారెడ్డి పరిచయ వేదికకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- జనాలతో కిక్కిరిసిన సభా ప్రాంగణం
- పెద్ద ఎత్తున భాగస్వామ్యమైన మహిళలు
- పరిచయ కార్యక్రమం విజయవంతంతో కేడర్‌లో నూతనోత్సాహం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, తదితర నేతలు



జనాలతో కిక్కిరిసిన సభా ప్రాంగణం

ఉదయగిరి: ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం అభిమాన జనసందోహంతో కిక్కిరిసింది. ఉదయగిరి నలువైపుల దారులు వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో రాకతో నిండిపోయాయి. ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పరిచయ వేదిక వద్దకు అంచనాకు మించి అభిమానులు తరలిరావడంతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ముందుగా ప్రకటించినప్పటికీ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. నిర్ణీత సమయానికే వేలాది మంది ప్రజలు సభావేదిక వద్దకు తరలివచ్చారు. జానపద నృత్య కళాకారులు తమ నాట్య విన్యాసాలతో అలరించారు. సమావేశ ప్రారంభంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతిప్రజ్వలన చేసి పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన చిన్న సోదరుడు మేకపాటి రాజారెడ్డిని నేతలకు, అభిమానులకు, కార్యకర్తలకు పరిచయం చేశారు. ఇంత వరకు మేకపాటి కుటుంబాన్ని ఏ విధంగా ఆశీర్వదించారో అదే విధంగా రాజారెడ్డిపై కూడా మీ చల్లని దీవెనలు ఉండాలని కోరారు. ఈ సమయంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును నేతలు ఉచ్ఛరించినప్పుడల్లా అభిమానులు, పార్టీ కార్యకర్తల నుంచి విశేష స్పందన లభించింది. మళ్లీ 2024లో జగన్‌మోహన్‌రెడ్డే సీఎం అవుతారని, ఉదయగిరి నుంచి మేకపాటి రాజారెడ్డే విజయం సాధిస్తారని నినాదాలతో హోరెత్తించారు. పరిచయ సమావేశాన్ని చీకటి పడకముందే ముగించారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తనయుడు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, తమ్ముడు రాజారెడ్డితో కలిసి తమ స్వగ్రామం బ్రాహ్మణపల్లిలో పూజలు నిర్వహించి రోడ్డు మార్గాన ఉదయగిరికి చేరుకున్నారు. సభా వేదికకు వచ్చే దారిలో వారికి పండితులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో అపూర్వ స్వాగతం పలికారు. మహిళలు వారిపై పూలవర్షం కురిపించారు. ఉదయగిరి సభ ఊహించని విధంగా విజయవంతం కావడంతో పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఉదయగిరిలో ఘన విజయం సాధిస్తుందని పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఈ పరిచయ వేదిక సమావేశంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉదయగిరి సీఐ వి.గిరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎంపీపీ ఇనగలూరు మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు మూలె వినయ్‌రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, కామేపల్లి వెంకటరత్నం, పాలవెల్లి మాలకొండారెడ్డి, కాటం రవీంద్రారెడ్డి, మద్దూరి బాబు, గువ్వల కృష్ణారెడ్డి, జూపల్లి రాజారావు, వాసిపల్లి కృష్ణారెడ్డి, లెక్కల పెదమాలకొండారెడ్డి, మూలె వీరారెడ్డి, గోగుల వెంగళరెడ్డి, మద్దూరు చిన్ని కృష్ణారెడ్డి, గాజుల షర్ఫుద్దీన్, తదితరులున్నారు.



మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, విక్రమ్‌రెడ్డిలకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు



బాబాయి, అబ్బాయిలను గజమాలతో సత్కరిస్తున్న గాజుల కుటుంబ సభ్యులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

అనుమసముద్రంపేట: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ బుధవారం తెలిపారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

కుక్కలకు రేబీస్ టీకాలు

అల్లూరు: గురువారం ప్రపంచ జునోసీస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెంపుడు కుక్కల యజమానులు, జంతు ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో, బైక్ ఢీ

- ఇద్దరికి గాయాలు



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు బస్టాండ్ సమీపంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటన బుధవారం జరిగింది. ప్రమాదంలో మర్రిపాడుకు చెందిన యర్రగంగు వెంకటేశ్వర్లు, గంగినేని వెంకట సుబ్బయ్యకు గాయాలు కావడంతో స్థానికులు వారిని మర్రిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స అందించారు.

ఉదయగిరికి తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సీతారామపురం నుంచి తరలుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు



ఉదయగిరి బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

సీతారామపురం: ఉదయగిరిలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పరిచయ సభకు సీతారామపురం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. 200 వాహనాల్లో రెండు వేల మంది మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా జగనన్న నినాదాలతో సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేశారు.

జలదంకి నుంచి..

జలదంకి: ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిచయ సభకు జలదంకి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీగా తరలివెళ్లారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చేవూరు జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ గుర్రం జగ్గయ్య ఆధ్వర్యంలో భారీగా ప్రత్యేక వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

ఉపాధి పనుల లక్ష్యాలను చేరుకోవాలి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి వ్యక్తికి వంద రోజుల పని కల్పించాలని, రోజు కూలి రూ.272 చొప్పున గిట్టుబాటు అయ్యేలా ఉండాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగేలా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే పంట కాలువలు, ఇతర మట్టి పనులను వర్షాలు మొదలుకాకమునుపే పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ శిరీషారెడ్డి, ఈసీ జానకి, మండలంలోని పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

వేగవంతంగా సచివాలయ భవనాల నిర్మాణాలు

ఆత్మకూరురూరల్: గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆత్మకూరు డివిజన్ పంచాయతీరాజ్‌శాఖ డీఈ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, తదితరాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో జూలై 20వ తేదీలోగా అన్ని భవనాల పనులు పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. పెండింగ్ బిల్లులు కూడా కాంట్రాక్ట్ ఏజెన్సీలకు ఇటీవలే పూర్తిగా ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ రాజ్ ఏఈ ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



కరటంపాడులో నిర్మాణాలు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ సురేష్‌బాబు

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొన్నేళ్లుగా పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను బుధవారం సత్కరించారు. హెచ్ఎం రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు రేవతి, రబ్బాని, వెంకటరెడ్డి, మాధవరావు, ఓబయ్య, పద్మ, మంజుల, కేవీ రమణయ్య తదితరులు ఇటీవల పలు ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. దీంతో విద్యార్థులు తమకు చదువు నేర్పిన గురువులను ఆత్మీయంగా సత్కరించి వారితో తమతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయురాలు కంచి అరుణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇందూరు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురువులను ఘనంగా సత్కరిస్తున్న విద్యార్థులు

పోలీసుల అన్నదానం



ఉదయగిరి: ఉదయగిరి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో బుధవారం మధ్యాహ్నం పోలీసులు పలువురు మహిళలకు అన్నదానం చేశారు. ఉదయగిరిలో మేకపాటి రాజారెడ్డి పరిచయ కార్యక్రమం బందోబస్తుకు నియోజకవర్గంలోని పలు స్టేషన్ల నుంచి పెద్ద సంఖ్యలో పోలీసులు వచ్చారు. వారి కోసం అక్కడే భోజన వసతి కల్పించారు. వీరితో పాటు ఉదయగిరికి వివిధ పనుల కోసం వచ్చిన మహిళలకు కూడా భోజనం వడ్డించి ఆకలి తీర్చారు.

అప్రమత్తత లేకుంటే అంతే

ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేస్తున్న రైతులు పంటలకు నీరు పెట్టడానికి వెళ్తూ పొరపాటున విద్యుత్ షాక్‌తో పలువురు రైతులు మృత్యువాత పడుతున్నారు. మరి కొందరు మరమ్మతులను వారికి వారే చేసుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పొలాల్లో తెగిపడిన తీగలు, కిందకు వేలాడుతున్న తీగలతో, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు వేయడానికి ప్రయత్నిస్తూ పలువురు రైతులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

- విద్యుత్ సమస్యలపై రైతులు పనులు చేయొద్దు
- విద్యుత్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలి
- విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



కుమ్మరకొండూరులో సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేస్తూ మృతి చెందిన ఇద్దరు వ్యక్తులు (ఫైల్)

కలిగిరి: వ్యవసాయ పొలాల్లో విద్యుత్ సమస్యలు వచ్చిన సమయంలో కొంత మంది రైతులు ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా సొంతంగా మరమ్మతులు చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పలు ఘటనల్లో మూగజీవాలు కూడా విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ ప్రమాదాల నివారణకు అప్రమత్తతతో పాటు అవగాహన అవసరమైన తగిన జాగ్రత్తలను ట్రాన్స్‌కో అధికారులు తెలియజేస్తున్నారు. వర్షాకాలం రానుండడంతో ఈదురు గాలులు ఎక్కువగా వీచే అవకాశాలు ఉండడంతో రైతులు, పొలాల్లోకి జీవాలను మేత కోసం తోలుకు వెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

సొంతంగా మరమ్మతులు చేస్తూ ఇద్దరు మృతి

కలిగిరి మండలంలోని కుమ్మరకొండూరులో గత నెల 29న విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ లైన్‌కు సొంతంగా మరమ్మతులు చేస్తూ రైతు కంచెంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వేల్పుల నారాయణ మృత్యువాత పడ్డారు. కనీసం ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేయించిన వారు ప్రాణాలతో ఉండేవారని బంధువులు, అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన తప్పనిసరి



ప్రతి ఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సొంతంగా విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టకూడదు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సమస్యలు ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే మరమ్మతులు చేస్తారు. వినియోగదారులు సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్లతోనే విద్యుత్ పనులు చేయించుకోవాలి.
– దినేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ, కలిగిరి

తెగిన తీగలతో 5 గేదెల మృతి

కలిగిరి మండలంలోని తూర్పుదూబగుంట సమీపంలో అగ్రిగోల్డ్ పొలాల్లో 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడడంతో విద్యుత్ షాక్‌తో ఈ ఏడాది జనవరి 26న 5 గేదెలు మృతి చెందాయి. బొట్టా విజయ్‌కుమార్ మేత కోసం పశువులను పొలానికి తోలుకుని వెళ్లగా మేత మేస్తున్న గేదెలకు తెగిపడి ఉన్న తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. అప్రమత్తమైన విజయకుమార్ పక్కకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది.




తూర్పుదూబగుంటలో విద్యుత్ తీగలు తెగిపడడంతో మృత్యువాత పడ్డ గేదెలు (ఫైల్)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ పనులు సొంతంగా చేసుకోరాదు.
- విద్యుత్ వైర్లు తెగిపడిన, వేలాడుతున్న ముట్టుకోరాదు. అటు వైపు వెళ్లకుండా స్థానిక లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి.
- తడి చేతితో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే కరెంట్ సరఫరా ఉండదని మరమ్మతులు చేయకూడదు.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పైకి అనధికారిక వ్యక్తులు ఎక్కి మరమ్మతులు చేయరాదు.
- మోటార్లు, ఇతర విద్యుత్ పరికరాలకు నాణ్యమైన వైర్లను మాత్రమే వాడాలి.
- సర్వీసు వైర్లకు అతుకులు, జాయింట్లు వేయరాదు. వదులుగా ఉండకూడదు.
- స్టార్టర్ వైర్లను నేల మీద ఉంచకూడదు. స్టార్టర్‌పై మూత తీసి వాడకూడదు.
- పొలాల్లో ఎలుకలు, ఉడతలు స్టార్టర్ల వైర్లు కొరికి సమయంలో విద్యుత్ షాక్ వచ్చే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- మోటార్లకు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించుకోవాలి
- తడిగా ఉన్న సమయంలో పంపు సెట్లను ఆన్ చేయకూడదు.
- ప్లగ్గులు పెట్టి మోటార్లు ఆన్ చేయకుండా తప్పనిసరిగా స్టార్టర్లను అమర్చుకోవాలి.
- విద్యుత్ లైన్ల కింద చెట్లను నాటకూడదు.
- పొలాల్లో పడి ఉన్న విద్యుత్ తీగలను చేతితో తాకరాదు.
- పంపుసెట్లు, ఫ్యూజులు పాడైతే సొంతంగా మరమ్మతులు చేయకుండా అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్లతో చేయించాలి.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి పొడవైన ప్లాస్టిక్ పైపు, కర్రతో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్య సహాయం అందించాలి.

వైభవంగా సాయినాథుడి గ్రామోత్సవం



సంగం: షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పూజల అనంతరం సాయినాథుడికి అత్యంత వైభవంగా మంగళవారం అర్ధరాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు. దువ్వూరు, వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెంతో పాటు సంగం పట్టణంలోని కొత్తూరు సాయిబాబా ఆలయాల్లోని సాయినాథుడికికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తూరు, బలిజపాళెం, బజారువీధి మీదుగా గ్రామోత్సవంగా సాగారు. ఇళ్ల ముంగిటకు వచ్చిన సాయినాథుడికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

ప్రైవేట్ కళాశాలల ఫీజులు తగ్గించాలి

ఆత్మకూరు: జిల్లాలో పలు ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను పీల్చిపిప్పి చేస్తున్నారని ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విద్యార్థులు ధర్నా నిర్వహించారు. పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ వద్ద ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్, మండల ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేడు, రేపు గడప గడపకు మన ప్రభుత్వం

సంగం: సంగం బిట్–2 సచివాలయం పరిధిలో గురు, శుక్రవారాల్లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. సాయంత్రం 4.30 నుంచి సంగం బిట్–2 సచివాలయం పరిధిలో జరుగుతుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కో–ఆర్డినేటర్లు, కన్వీనర్లు, గృహసారథులు, సంబంధిత శాఖల అధికారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.